శనివారం 27-04-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక:316, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com

# నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే ఏం చేయాలి..?

## భారత ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు




**ముందడుగు ఢిల్లీ:**


పోటీలో ఉన్న అభ్యర్థులకంటే ఎన్నికల్లో నోటాకు అత్యధికంగా ఓట్లు వస్తే.. సదరు నియోజకవర్గం ఫలితాన్ని రద్దు చేసి కొత్తగా పోలింగ్ నిర్వహించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలయ్యింది. దీనిని పరిశీలించిన సుప్రీం ధర్మాసనం.. ఈ అంశంపై భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. శివ్ ఖేరా అనే రచయిత పిల్ ద్వారా లేవనెత్తిన అంశాలను పరిశీలించేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం అంగీకరించింది.

నోటా కంటే తక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థులను తదుపరి ఎన్నికల్లో (ఐదేళ్ల పాటు అన్ని ఎన్నికల్లో) పోటీ చేయకుండా చూసేలా నిబంధనలు రూపొందించాలని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా నోటాను 'కల్పిత అభ్యర్థి'గా తెలియజేస్తూ విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఈ అంశాలకు సంబంధించి తగిన నిబంధనలను రూపొందించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఇటీవల సూరత్‌లో పోలింగ్ జరగకుండానే ఓ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికైన తీరును ప్రస్తావించారు. పిటిషనర్ చేసిన ఈ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం ధర్మాసనం.. ఈసీకి నోటీసులు పంపించింది. ఇది కూడా ఎన్నికల ప్రక్రియలో భాగమేనని, దీనిపై ఎన్నికల సంఘం ఏం చెబుతుందో చూద్దామని పేర్కొంది. పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంతో 2013లో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈవీఎంలలో నోటా ఆప్షన్ కల్పించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో ఎవ్వరూ నచ్చకపోతే.. ఈ 'నోటా' మీట నొక్కే సదుపాయం ఉంది. అయితే, ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం, నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే చట్టపరంగా ఎలాంటి పరిణామాలు ఉండవు. ఇటువంటి సందర్భంలో ఎవరికి ఎక్కువగా ఓట్లు వస్తే ఆ అభ్యర్థినే విజేతగా ప్రకటిస్తారు.



ఎండలకు తట్టుకోలేక


## నలుగురు ఓటర్లు మృతి



ఓటు వేసిన వారికి

## బటర్ దోశ, లడ్డూ, జ్యూస్

వివరాలు 2లో




ఆసుపత్రిలో ఉన్నా..

## ఓటు వేసేందుకు వచ్చారు

వివరాలు 2లో

## తెలంగాణలో రాగల ఐదురోజులు వడగాలులు

- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక



**ముందడుగు తెలంగాణ:**

తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. దానికి తోడు రాగల ఐదురోజుల పాటు వడగాలులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. అదే సమయంలో అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావొద్దని హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడుతుండడంతో ఉష్ణోగ్రతుల పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. అదే సమయంలో ఆదివారం నుంచి సోమవారం వరకు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది.

శుక్రవారం మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, మిగతా 2లో

## హార్లిక్స్‌పై హెల్త్ డ్రింక్ పేరు తొలగింపు

### చక్కెర స్థాయిలు అధికంగా ఉన్నాయని ఆరోపణ




**ముందడుగు జాతీయం:**

చిన్న పిల్లలు ఎంతో ఇష్టంగా త్రాగే హార్లిక్స్‌పై, ఆ కంపెనీ తన లేబుల్‌పై కీలక మార్పులు చేసింది. 'హార్లిక్స్'ను 'హెల్త్ డ్రింక్'గా పేర్కొన్న 'హిందుస్తాన్ యూనిలీవర్' (హెచ్‌యూఎల్), దాన్ని తొలగించి..'ఫంక్షనల్ న్యూట్రీషినల్ డ్రింక్స్'గా మార్చింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఇటీవల జారీచేసిన ఉత్తర్వుల మేరకు హెచ్‌యూఎల్ ఈ మార్పును చేపట్టినట్టు తెలుస్తున్నది.


బోర్న్‌వీటా, హార్లిక్స్‌లలో చక్కెర స్థాయిలు అధికంగా ఉన్నాయన్న ఆరోపణలు రావటంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ దీనిపై స్పందిస్తూ, ఈ అంశంపై విచారణ జరపాలని 'ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ'ని ఆదేశించింది. దీంతో కంపెనీలు తమ ఆహార ఉత్పత్తుల లేబుల్‌పై మార్పులు చేసినట్టు తెలుస్తున్నది.

## స్త్రీ ఆస్తిపై భర్తకు ఎలాంటి హక్కు ఉండదు

కీలకమైన తీర్పు వెల్లడించిన సుప్రీంకోర్టు

**ముందడుగు జాతీయం:**

ఒక వధువు పెళ్లి సందర్భంగా పుట్టింటి వారు బహుమతిగా ఇచ్చే స్త్రీ ధనంపై సుప్రీం కోర్టు కీలకమైన తీర్పు ప్రకటించింది. స్త్రీ ధనంపై భర్తకు ఎలాంటి నియంత్రణ ఉండదని, అయితే కుటుంబం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు దాన్ని వాడుకోవచ్చునని, అయితే తర్వాత దానిని, లేదా దానికి సరిపడా మొత్తాన్ని భార్యకు తిరిగి ఇవ్వాల్సిన నైతిక బాధ్యత భర్తపైనే ఉందని స్పష్టం చేసింది. అది ఉమ్మడి ఆస్తి ఎంతమాత్రం కాదని, దానిపై ఎలాంటి ఆధిపత్యం కానీ, యాజమాన్య హక్కులు కానీ భర్తకు సంక్రమించవని పేర్కొంది. ఈ కేసులో భర్త వాడుకున్న 25 లక్షల విలువైన బంగారాన్ని తిరిగి ఆమెకు ఇవ్వాల్సిందేనని జస్టిస్‌లు సంజయ్ ఖన్నా, దీపాంకర్ దత్తాల ధర్మాసనం ఒక కేసులో తీర్పు చెప్పింది.



ముందడుగు
శనివారం, 27-04-2024, హైదరాబాద్

# ఎండలకు తట్టుకోలేక నలుగురు ఓటర్లు మృతి

## కేరళలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు



**ముందడుగు కేరళ:**

కేరళ, కర్నాటక రాష్ట్రాల్లో శుక్రవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో.. ఓటర్లు ఆపసోపాలు పడుతూ పోలింగ్ బూత్‌లకు చేరుకుంటున్నారు. కేరళలో హీట్‌వేవ్ ఎక్కువగా ఉన్నది. పాలక్కాడ్, మలప్పురం, అలప్పుజా నియోజకవర్గాల్లో ముగ్గురు ఓటర్లు మృతిచెందారు. ఎండ వేడి తట్టుకోలేక వాళ్లు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. కోజికోడ్‌లో ఓ పోలింగ్ ఏజెంట్ మృతిచెందాడు. ఒట్టపాలెంలో ఓ వ్యక్తి ఓటు వేసిన తర్వాత ప్రాణాలు కోల్పోయాడు. అతని వయసు 68 ఏళ్లు. ఒట్టపాలెం తాలూక ఆస్పత్రికి తీసుకెళ్లినా అతని ప్రాణాలు దక్కలేదు. పాలక్కాడ్‌లో అత్యధికంగా 40 డిగ్రీలు నమోదు అయ్యింది. తిరూర్‌లో ఓటు వేసిన ఓ మదరసా టీచర్ కూడా ఇంటికి వచ్చి కుప్పకూలిపోయాడు. అలప్పుజాలో ఓటు వేసి ఇంటికి వెళ్లిన తర్వాత 82 ఏళ్ల సోమరాజన్ ప్రాణాలు కోల్పోయాడు. కేరళలో మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటింగ్ 40 శాతం దాటింది.

తెలంగాణలో రాగల

# ఐదురోజులు వడగాలులు

**మొదటిపేజీ తరువాయి**

వనపర్తి జోగులాంబ జిల్లాల్లో.. శనివారం మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భ పాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వడగాలులు వీస్తయంటూ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. 28న నాగర్ కర్నూల్, వనపర్తి, నరాయణపేట, జోగులాంబ, గద్వాల జిల్లాలకు వడగాలులు వీస్తాయంటూ ఆరెంజ్ అలెర్ట్ జారీ అవగా.. పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

ఆదివారం కుమ్రంభీం, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. 29న నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ, గద్వాల జిల్లాలు, 30న కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు వడగాలలు వీస్తాయని చెప్పింది.

# బలవంతం చేస్తే వాట్సాప్ సేవలు నిలిపివేస్తాం

## ఢిల్లీ హైకోర్టు బెంచ్‌కి తెలిపిన వాట్సాప్ న్యాయవాది



**ముందడుగు ఢిల్లీ:**


ఎన్‌క్రిప్షన్‌ను విచ్చిన్నం చేయాల్సి వస్తే, భారతదేశంలో వాట్సాప్ సేవలు నిలిపివేయాల్సి ఉంటుందని ఢిల్లీ హైకోర్టు బెంచ్‌కి తెలిపారు. సవరించిన సమాచారం సాంకేతిక నిబంధనలకు వ్యతిరేకంగా సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించారు. ఐటి నిబంధనలకు సవరణలను వ్యతిరేకిస్తూ వాట్సాప్, సంప్రదింపులు లేకుండా నిబంధనలను ప్రవేశపెట్టినట్లు పేర్కొంది. ఇది వినియోగదారుల గోప్యతకు వ్యతిరేకమని పేర్కొంది. వాట్సాప్‌ను యూజర్లు గోప్యతా ఫీచర్ల కోసం ఉపయోగిస్తున్నారని కోర్టుకు తెలిపారు. ఇదిలా ఉంటే యూజర్ల గోప్యత కోసం వాట్సాప్ ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ ఫీచర్ తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ ఫీచర్ సహాయంతో యూజర్ల డేటా ఎవరికీ తెలియకుండా ఉంటుంది. అయితే ఎన్‌క్రిప్షన్‌ను తొలగించాలని అనడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19 మరియు 21 ప్రకారం వినియోగదారుల ప్రాథమిక హక్కులను ఈ నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయని సంస్థ వాదిస్తోంది. ఇలాంటి నిబంధనలు ప్రపంచంలో మరెక్కడా లేవని వాట్సాప్ తరపున న్యాయవాది పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. ఈ నిబంధనలు అమలు చేయకపోతే నకిలీ సందేశాల మూలాన్ని కనుగొనడంలో చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీలు ఇబ్బంది పడతాయని మంత్రిత్వ శాఖ ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. ఇలాంటి సందేశం దేశంలో శాంతి, సామరస్యాలకు విఘాతం కలిగిస్తుందని, పబ్లిక్ ఆర్డర్ సమస్యలను కలిగిస్తుందని పేర్కొంది. మరి ఈ వ్యవహారం ఎటు వైపు మలుపు తీసుకుంటుందో చూడాలి.

# ఆసుపత్రిలో ఉన్నా.. ఓటు వేసేందుకు వచ్చారు

- యువత ఓటు హక్కును వినియోగించుకోవాలి
- ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి

**ముందడుగు బెంగళూరు:**

దేశంలో జరుగుతున్న రెండో దశ పోలింగ్‌లో ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి, ఆయన సతీమణి సుధామూర్తి బెంగళూరులో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ''ప్రతి ఐదేళ్లకు ఒకసారి మనకు ఈ ఓటు హక్కు వస్తుంది. ఎంతో విశ్లేషణ తర్వాత ఈ హక్కును వినియోగించుకోవాలి. ఎవరూ ఈ అవకాశాన్ని వదులుకోవద్దు'' అని నారాయణ మూర్తి ఓటర్లకు సూచించారు.



నారాయణమూర్తి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆసుపత్రిలో ఉన్నా.. ఓటు వేసేందుకు ఇక్కడకు వచ్చారు. ఓటింగ్ తర్వాత ఆయన్ను ఇంటికి తీసుకెళ్తాం. మేం పర్యటనలకు సంబంధించి ఇప్పటికే కొన్ని ప్లాన్స్ వేసుకున్నాం. కానీ.. వాటన్నింటికంటే ముందు ఓటు వేయడం ముఖ్యం. కూర్చొని మాటలు చెప్పే బదులు బయటకు వచ్చి, మీ హక్కును వినియోంచుకొని మీ అభిప్రాయాన్ని చెప్పండి. మాలాంటి సీనియర్లు వచ్చి క్యూలో నిల్చుంటున్నారు. యువత తప్పక రావాలి. సాధారణంగా విద్యావంతులు తక్కువ సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొంటారు. మీ హక్కును మీరు తప్పక ఉపయోగించుకోవాలి'' అని సుధామూర్తి పిలుపునిచ్చారు. మామూలుగా బెంగళూరులో ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతుంటుంది. దానిని ఉద్దేశించి ఆమె స్పందించారు. వీరిద్దరు జయనగరలోని బీఈఎస్ కాలేజ్ పోలింగ్ కేంద్రంలో ఓటేశారు.

# ఓటు వేసిన వారికి బటర్ దోశ, లడ్డూ, జ్యూస్

## ఓటు వేసిన వారికి బటర్ దోశ, లడ్డూ, జ్యూస్

**ముందడుగు బెంగళూరు:**

బెంగళూరు నగరంలో పోలింగ్ శాతాన్ని పెంచే ఉద్దేశంతో బృహత్ బెంగళూరు హోటల్స్ అసోసియేషన్ (బీబీహెచ్ఏ)కు అనుబంధంగా ఉన్న పలు రెస్టారంట్లు తమవంతు ప్రయత్నం చేయాలని భావించాయి. ఇందులోభాగంగా ఓటు వేసి వచ్చిన వారికి ఉచితంగా ఆహార పదార్థాలు అందించగా.. మరికొన్ని మాత్రం బిల్లులో డిస్కౌంట్ ఇచ్చాయి. నృపతుంగా రోడ్డులో ఉన్న నిసర్గ గ్రాండ్ హోటల్.. ఓటు వేసి వచ్చిన వారికి బటర్ దోశ, లడ్డూ, జ్యూస్ వంటివి ఉచితంగా అందించింది. 'ఓటు వేయండిఫుడ్ తినండి' అనే నినాదంతో వీటిని అందించింది. దీంతో ఉదయం నుంచే అనేకమంది ఓటర్లు హోటల్ ముందు బారులు తీరారు. దాదాపు 2వేల మందికి



వీటిని ఫ్రీగా అందించారట. నగరంలోని అనేక రెస్టారంట్లు, బేకరీలు.. వినోద కేంద్రాలు, పార్కులు, ర్యాపిడో వంటి టాక్సీ సర్వీసులు కూడా 20 నుంచి 30శాతం డిస్కౌంట్ ప్రకటించాయి

ముందడుగు
శనివారం, 27-04-2024, హైదరాబాద్

# రాజీనామా పత్రంతో వచ్చిన హరీష్ రావు

- అమరుల స్తూపం వద్దకు వచ్చానని సవాల్
- రాజీనామాకు రావట్లేదంటే మోసగించినట్లే
- గన్‌పార్క్ నుంచి ఎమ్మెల్యే హరీశ్ రావు

**ముందడుగు హైదరాబాద్:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరించి తన రాజీనామా పత్రంతో అమరుల స్తూపం వద్దకు వచ్చానని, ప్రజలకు ఇచ్చిన హామీలు నిజమైతే గన్‌పార్క్ వద్దకు ముఖ్యమంత్రి రావాలని ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో ఆయన హరీశ్ రావు అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్ వద్దకు వచ్చారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇద్దరి రాజీనామా పత్రాలను మేధావుల చేతుల్లో పెడదామన్నారు.

ఆగస్టు 15లోగా రుణమాఫీ, ఆరు గ్యారంటీలు అమలు చేయాలన్నారు. హామీలు అమలు చేస్తే తన రాజీనామా లేఖను స్పీకర్‌కు ఇవ్వాలని చెప్పారు. అమలు చేయకపోతే రేవంత్ రెడ్డి తన రాజీనామా లేఖను గవర్నర్‌కు ఇవ్వాలన్నారు. రాజీనామాకు ముందుకు రావట్లేదంటే ప్రజలను మోసగించినట్లేనని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయించడమే తమ కర్తవ్యమని వెల్లడించారు. ఆరు గ్యారంటీలపై తొలి సంతకం పెడతామని మోసగించారని చెప్పారు. ప్రజలను మోసం చేసినందుకుగాను బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.



# వీవీప్యాట్ స్లిప్‌లు 100% లెక్కింపు కుదరదు

- పిటిషన్లను తిరస్కరించిన సుప్రీంకోర్టు
- ప్రతి పార్టీ పక్కన బార్‌కోడ్ అంశం పరిశీలించాలి

**ముందడుగు ఢిల్లీ:**

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నమోదైన ఓట్లతో 100 శాతం వీవీప్యాట్ల స్లిప్పులను సరిపోల్చి లెక్కించాలన్న పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఈ మేరకు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఒకే అభిప్రాయంతో రెండు తీర్పులు వెలువరించింది. ఈ పిటిషన్లపై ఇటీవల సుప్రీంకోర్టు విస్తృతంగా విచారణ జరిపిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రొటోకాల్‌లు, సాంకేతిక అంశాలపై ఎన్నికల సంఘానికి పలు ప్రశ్నలు సంధించిన ధర్మాసనం.. ఈసీ నుంచి సమగ్ర వివరణ తీసుకుంది. అనంతరం తీర్పును రిజర్వ్ చేసిన న్యాయస్థానం.. పేపర్ బ్యాలెట్ ఓటింగ్ డిమాండ్లు సహా అన్ని పిటిషన్లను కొట్టివేస్తూ ఉత్తర్వులు వెలువరించింది.
ఈ సందర్భంగా ఎన్నికల సంఘానికి పలు ఆదేశాలు జారీ చేసింది. ఈవీఎంలో సింబల్ లోడింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆ యూనిట్‌ను సీల్ చేయాలని తెలిపింది. దాన్ని కనీసం 45 రోజుల పాటు భద్రపర్చాలని సూచించింది. జస్టిస్ దీపాంకర్ దత్తా కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక వ్యవస్థను గుడ్డిగా అపనమ్మకంతో చూడటం.. అనవసర అనుమానాలకు దారి తీస్తుందని అభిప్రాయపడ్డారు. కౌంటింగ్ సమయంలో పేపర్ స్లిప్‌లను లెక్కించేందుకు ఎలక్ట్రానిక్ మెషిన్‌ను ఉపయోగించాలన్న పిటిషనర్ల సూచనను పరిశీలించాలని జస్టిస్ ఖన్నా ఈసీకి తెలిపారు. ప్రతి పార్టీ పక్కన గుర్తుతో పాటు బార్‌కోడ్ కూడా ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.



# నన్ను చంపేందుకు కుట్ర జరుగుతుంది

- నాకు ప్రాణ హాని ఉంది.. రక్షణ కల్పించండి
- వైజాగ్ సీపీకి సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ఫిర్యాదు

**ముందడుగు విశాఖపట్నం:**

విశాఖపట్నంలో నా ప్రాణాలు తీసేందుకు కుట్ర జరుగుతుంది. నాకు ప్రాణ హాని ఉంది. రక్షణ కల్పించండి అని జైభారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం విశాఖపట్నం సీపీని కలిసి ఫిర్యాదు చేశారు. గతంలో తాను సీబీఐ జేడీగా వ్యవహరించిన సందర్భంలో డీల్ చేసిన కేసుకు సంబంధించి గాలి జనార్ధన్ రెడ్డి అనుచరుల నుంచి తనకు ఈ ప్రాణ హాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గాలి జనార్ధన్ రెడ్డి అనుచరులు కొందరు విశాఖపట్నంలో ఉన్నారని... వారంతా తన కార్యకలాపాలపై దృష్టి సారించి తనను హత్య చేసేందుకు సిద్ధం అయ్యారని తెలుస్తోందన్నారు. ఇప్పటికే ఆ గూండాలు రెక్కి సైతం నిర్వహించారని తనకు అనుమానం కలుగుతుందని విశాఖ పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్ అయ్యన్నార్‌కి ఫిర్యాదు చేశారు.

### రెక్కీ నిర్వహించారంటూ మాజీ జేడీ అనుమానం

ప్రస్తుతం విశాఖ నార్త్ నియోజవర్గం నుంచి జై భారత్ నేషనల్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వీవీ లక్ష్మీనారాయణ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ సైతం ఆమోదం పొందింది. జై భారత్ నేషనల్ పార్టీకి పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల కామన్ సింబల్‌గా టార్చిలైట్ గుర్తును కేటాయిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. గత ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన వీవీ లక్ష్మీనారాయణ వచ్చే ఎన్నికల్లో గెలుపొందాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం విస్తృతంగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఇలాంటి తరుణంలో అకస్మాత్తుగా తనను హత్య చేసేందుకు రెక్కీ సైతం నిర్వహించారని ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది.



### హై ప్రొఫైల్ కేసుల నుంచి ముప్ప

వీవీ లక్ష్మీనారాయణ సీబీఐ జేడీగా పనిచేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో పలు హై ప్రొఫైల్ కేసులను డీల్ చేశారు. 'సత్యం రామలింగరాజు కేసు నుంచి మొదలుకొని గాలి జనార్దన్ రెడ్డి అక్రమ మైనింగ్ వ్యవహారం, అక్రమాస్తుల కేసులో సీఎం వైఎస్ జగన్‌కేసును సైతం డీల్ చేశారు. సీఎం జగన్‌పై సీబీఐ, ఈడీ కేసుల వరకు అనేక కేసులను డీల్ చేసిన లక్ష్మీనారాయణ దేశంలోనే మంచి పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా పేరొందారు. అనంతరం 2019లో రాజకీయాల్లో చేరారు. జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. విశాఖపట్నం లోక్‌సభకు జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి 2 లక్షల 88 వేలు ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో జనసేన పార్టీకి గుడ్ బై చెప్పేశారు. ఆ తర్వాత పలు పార్టీల నుంచి ఆహ్వానాలు అందాయి. కానీ ఆయన ఏ పార్టీలోనూ చేరలేదు. సొంతంగా జైభారత్ నేషనల్ పార్టీని స్థాపించారు. వచ్చే ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాలలో జై భారత్ నేషనల్ పార్టీ తరపున అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.



# పూజా బేబీ తగ్గదంతే..!

సౌత్ లో స్టార్డం ని ఎంజాయ్ చేస్తూ స్టార్స్ తో జత కడుతూ వచ్చిన పూజా హెగ్డే కెరీర్ సడెన్ గా డ్రాప్ అయిపోయింది. తనకు స్టార్ డం ఇచ్చిన టాలీవుడ్ లోనే ఆమెను ఎవరు పట్టించుకోకపోవడం జీర్ణించుకోలేకపోతుంది పూజా బేబీ. గుంటూరు కారం నుంచి బయటకు రావడమే ఆమె చేసిన పెద్ద తప్పనుకునేలా పరిస్థితి ఏర్పడింది. అటు బాలీవుడ్ లో కూడా పూజా హెగ్డేకి పెద్దగా అవకాశాలు లేవు. ప్రస్తుతం అక్కడ షాహిద్ కపూర్ తో దేవా సినిమాలో నటిస్తుంది. ఆ సినిమా పూర్తైతే అక్కడ ఖాళీ అయినట్టే. దేవా సినిమా కోసం కూడా పూజా హెగ్డే బాగా కష్టపడుతుందని టక్. ఇదిలా ఉంటే కొద్దిపాటి గ్యాప్ తర్వాత పూజా బేబీకి టాలీవుడ్ నుంచి పిలుపు వచ్చిందని చెబుతున్నారు. పాన్ ఇండియా సినిమాలో స్పెషల్ సాంగ్ కోసం అమ్మడిని సంప్రదించారట. ఎన్.టి.ఆర్, కొరటాల శివ కాంబినేషన్ లో వస్తున్న దేవర సినిమాలో ప్రత్యేక గీతం కోసం బుట్ట బొమ్మని తీసుకోవాలని మేకర్స్ నిర్ణయించుకున్నారట. అయితే రాక రాక వచ్చిన ఛాన్స్ కదా పూజా ఏమైనా తగ్గుతుందేమో అనుకున్నారు కానీ అమ్మడు మాత్రం స్పెషల్ సాంగ్ చేస్తా కానీ అడిగినంత రెమ్యునరేషన్ ఇవ్వాల్సిందే అని అంటుందట. సినిమాకు 3 కోట్ల దాకా తీసుకునే పూజా హెగ్డే స్పెషల్ సాంగ్ కోసం కూడా 2 కోట్ల దాకా డిమాండ్ చేస్తుందని టాక్.

ముందడుగు
శనివారం,
27-04-2024,
హైదరాబాద్

### భారీ వర్షాలకు
# దెబ్బతిన్న జైలు

## 118 మంది ఖైదీలు పరారైనట్లు వెల్లడి



**ముందడుగు నైజీరియా:**
నైజీరియాలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలోనే నైజీరియా రాజధాని అబూజ సమీపంలోని సులేజా ప్రాంతంలో ఉన్న జైలు భారీ వర్షాలకు దెబ్బతిన్నది. దీంతో ఆ జైలు ప్రహరీ గోడ బుధవారం రాత్రి కూలిపోయింది. ప్రహరీ గోడతోపాటు జైలు ఆవరణలో ఉన్న మరికొన్ని భవనాలు కూడా ధ్వంసం అయ్యాయి. అయితే ఇదే అదనుగా భావించిన ఆ జైలులోని ఖైదీలు.. బయటికి పారిపోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే ఆ జైలులో ఉన్న 118 మంది ఖైదీలు పరారైనట్లు జైలు అధికారులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విమర్శలకు దారి తీయడంతో ఉన్నతాధికారులు స్పందించారు. పారిపోయిన ఖైదీల కోసం గాలింపు చేపట్టారు. ఇప్పటివరకు 10 మంది ఖైదీలను మాత్రమే పట్టుకున్నట్లు చెప్పారు. మిగిలినవారి కోసం సెర్చ్ ఆపరేషన్ చేపట్టినట్లు వివరించారు. అయితే ఎవరెవరు తప్పించుకున్నవారు అనేది మాత్రం అధికారులు వెల్లడించలేదు. గతంలో ఇదే జైలులో బోకో హరమ్ గ్రూప్ సభ్యులను కూడా బంధించగా.. పారిపోయిన వారిలో వారు కూడా ఉన్నారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక ఖైదీలు జైలు నుంచి తప్పించుకోవడంతో ఆయా కేసుల్లో బాధితులుగా ఉన్నవారు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. నైజీరియా జైళ్ల నుంచి ఖైదీలు తప్పించుకోవడం గతంలో కూడా చాలా సార్లు జరిగింది.



## మహిళ వైద్యుల చికిత్సతో
# రోగి వైద్యం నయం

- రోగి బతికే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు వెల్లడి
- అన్నల్స్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్ అధ్యయనం

**ముందడుగు జాతీయం:**
మహిళ డాక్టర్లు వైద్యం అందిస్తే రోగులు ఆనందంగా ఉండడమే కాకుండా, బతికే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తాజాగా ఓ అధ్యయనం వెల్లడించింది. అన్నల్స్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్‌లో ప్రచురించబడిన అధ్యయనం ప్రకారం పురుష వైద్యులు చికిత్స అందించిన రోగులతో పోలిస్తే మహిళా వైద్యుల చికిత్సలో మరణాల రేటు తగ్గిందని తేలింది. ఈ అధ్యయనం 2016 నుండి 2019 వరకు వివిధ వైద్య పరిస్థితుల కారణంగా ఆస్పత్రిల్లో చేరిన 4,58,100 మంది మహిళా రోగులు మరియు 3,18,800కంటే ఎక్కువ మంది మగ రోగులతో సహా 7,76,000 మందిపై అధ్యయన చేసింది.

### పేషేంట్లతో ఎక్కువ సమయం గడపడం

మహిళా వైద్యులు తమ పేషెంట్ల పట్ల ఎక్కువ సంరక్షణ అందిస్తారని ముఖ్యమైన విషయమని, అందువల్ల వీరి పర్యవేక్షణలో ఉన్న రోగులకు ఎక్కువ ప్రయోజనం చేకూరుతోందని పరిశోధకుడైన యుసుకు సుగావా తెలిపారు. మహిళా వైద్యులు రోగులతో మాట్లాడటం, వారి రికార్డులు చూడటం వంటి ప్రక్రియలకు ఎక్కువ సమయం కేటాయిస్తారని, మెరుగైన సంభాషణ కలిగి ఉంటారని స్టడీలో తేలింది. మహిళా వైద్యులచే చికిత్స పొందడం, ముఖ్యంగా సున్నితమైన పరీక్షల సమయంలో మహిళ రోగులకు కలిగే ఇబ్బంది, అసౌకర్యం తగ్గుతుందని పరిశోధకులు తేల్చారు. ముఖ్యంగా మహిళా వైద్యులు తమ పేషెంట్లతో ఎక్కువ సమయం గడుపుతారని తేలింది. 2002 నుండి జరిగిన ఒక ప్రత్యేక అధ్యయనంలో మహిళా వైద్యులు సగటున 23 నిమిషాలు రోగితో గడిపారని, పురుష వైద్యులు 21 నిమిషాలు గడిపారని కనుగొన్నారు.

### త్వరగా కోలుకుంటున్నారు..

**మహిళా వైద్యులు చికిత్స చేసిన రోగుల్లో మరణాలు తక్కువగా ఉన్నట్లు, త్వరగా కోలుకున్నట్లు అధ్యయనం తేల్చింది. మహిళా వైద్యులతో చికిత్స పొందిన స్త్రీ పెషెంట్లలో మరణాల రేటు 8.15 శాతం ఉండగా.. పురుష వైద్యులు చికిత్స చేసినప్పుడు 8.38 శాతంగా ఉంది. ఇదే విధంగా లేడీ డాక్టర్లు చికిత్స చేసిన మగ రోగుల్లో మరణాల రేటు 10.15 శాతం ఉండగా.. పురుష వైద్యుల వైద్యంలో 10.23 శాతంగా ఉంది.**

### స్పైడర్ మ్యాన్ దుస్తుల్లో
# ఢిల్లీలో చక్కర్లు

## ఇద్దరు జంట చేసిన పనికి జైలు పాలు

**ముందడుగు ఢిల్లీ:**
సోషల్‌మీడియాలో పాపులర్ కోసం కొంతమంది చేసే విన్యాసాలు విమర్శల పాలవుతుంటాయి. పైగా కొత్త చిక్కులు తెచ్చి పెడుతుంటాయి. ఇంకాస్త తేడా జరిగితే కటకటాలే తరువాయి. తాజాగా అలాంటి ఘటనే జరిగింది. నెట్టింట పాపులర్‌గా మారేందుకు ఓ జంట చేసిన పని చివరకు వారు జైలు పాలయ్యేలా చేసింది.



స్పైడర్ మ్యాన్ దుస్తుల్లో ఆదిత్య (20), స్పైడర్ ఉమెన్ వేషధారణలో అంజలి(16) మోటార్ సైకిల్‌పై ఢిల్లీ వీధుల్లో చక్కర్లు కొట్టారు. బైక్‌ని వదిలేసి విన్యాసాలు చేస్తూ రీల్స్ రూపొందించారు. దాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకున్నారు. అంతే ఆ వీడియో కాస్తా వైరల్‌గా మారి చివరకు పోలీసుల కంట పడింది. అద్దాలు, నంబర్ ప్లేట్ లేని బైక్‌పై హెల్మెట్ ధరించకుండా వీరిద్దరూ ప్రయాణించడం వీడియోలో స్పష్టంగా కనిపించింది. దీన్ని గుర్తించిన పోలీసులు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన కారణంగా ఇద్దరినీ శుక్రవారం అరెస్టు చేశారు.

# హైదరాబాద్‌లో రాత్రి 10 దాటితే జాగ్రత్త

- రోడ్డుపై నడుస్తూ వెళ్లేవారే వారి టార్గెట్..
- అంతరాష్ట్ర ముఠాపై పోలీసుల హెచ్చరిక

**ముందడుగు క్రైం:**
హైదరాబాద్‌లో మొబైల్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న అంతర్జాతీయ ముఠాను సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ముఠాకు చెందిన ఐదుగురు సూడాన్ దేశస్థులతో సహా 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఏకంగా రూ.1.75 కోట్ల విలువైన 703 సెల్‌ఆ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను హైదరాబాద్




సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి మీడియా ముందు ప్రవేశపెట్టారు.
నిందితుల్లో 12 మంది హైదరాబాద్‌కు చెందినవారని.. ఐదుగురు సూడాన్ వాసులు ఉన్నారని సీపీ వెల్లడించారు. రాత్రి సమయంలో రోడ్ల వెంట నడుచుకుంటూ వెళుతున్న వారినే ఈ స్నాచింగ్ ముఠా టార్గెట్ చేసుకుంటున్నారని తెలిపారు. కొన్ని సందర్భాల్లో వారిని మాటల్లో పెట్టి మొబైల్ స్నాచింగ్, నగదు చోరీ చేస్తున్నారని చెప్పారు. రాత్రి 10 గంటలు తర్వాత స్నాచింగ్స్ ఎక్కువగా జరుగుతున్నట్టు గుర్తించామన్నారు. నగరంలోని 3 కమిషనరేట్ల పరిదిలో ఈ స్నాచింగ్ జరుగుతుందని.. చోరీకి గురైన, దెబ్బతిన్న సెల్‌ఫోన్లను అబిడ్స్‌లోని జగదీశ్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని తెలిపారు. దెబ్బతిన్న ఫోన్లను అక్కడే డిస్మెంట్ చేస్తున్నారన్నారు. ఓ వ్యక్తి జగదీశ్ మార్కెట్‌లో ఇలాంటి ఫోన్ల కోసం ప్రత్యేకంగా ఒక కౌంటర్ ఏర్పాటు చేశాడన్నారు. దొంగిలించిన సెల్‌ఫోన్లను సముద్ర మార్గం ద్వారా సూడాన్ తరలిస్తున్నారని.. విమానాశ్రయాల్లో అయితే నిఘా ఎక్కువగా ఉంటుందని, పడవల్లో వాటిని తీసుకెళ్తున్నారని వివరించారు.